
# సినీ బేతాళ కథలు





## – డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 19 -

### - అపూర్వరాగంగళ్ -

**బేతాళుడి** శవాన్ని విక్రమార్కుడు మళ్లీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

"విక్రా! నీకు శ్రమ కలగకుండా వుండేందుకు మళ్లీ మరో కథ చెబుతాను విను" - అని బేతాళుడు ప్రారంభించాడు.

"ఆ మధ్యెప్పుడో ఆస్కార్ అవార్డ్స్ ఫంక్షన్‌లో మెరిల్‌స్ట్రీప్ చెప్పింది - 'మేమూ అందరిలాగే మామూలు మనుషులమే. అందరిలాగే మేమూ భోంచేస్తాం. చెంబుచ్చుకుని తోటలోకి వెళ్తాం. అడపాదడపా అపానవాయువులు కూడా డబ్బింగ్ లేకుండా వదుల్తాం. మా వృత్తి నటన. మా నటన మేం బాగా చెయ్యడానికి కృషిచేస్తాం. సాధారణ వ్యక్తులతో సమానమైన మాకు 'స్టార్స్' అంటూ యీ గ్లామర్ యెందుకు అంటగడతారో అర్థంకాదు -' అని.

"నాకిప్పుడో కథ గుర్తుకొస్తోంది. అదివరకు, డర్‌బుర్ రాణి అని వొక మహానటి వుంది. ఆమె వొక సినిమాలో నటిస్తోంది. నిర్మాణానికి ముందే ఆ చిత్రంలో సౌండ్ ఎఫెక్ట్స్ పుష్కలంగా వున్నాయి. నిర్మాతపేరు ఢమాక్‌రావు. దర్శకుడి పేరు గాండ్రుశర్మ, కెమెరామన్ పేరు కట్‌ఫట్ గులాటి. సంగీత దర్శకుడి పేరు తుస్‌తుస్ రాజా. కేటరింగ్ చేసేందుకు శబ్దతారకం అనే వంటాయన్ని కుదుర్చుకున్నారు.

శబ్దతారకంగారికి సెనగపప్పు, బంగాళాదుంపలు బాగా యిష్టం. అంచేత రకరకాల ఐటెమ్స్‌గా రోజూ అవే యూనిట్ మొత్తానికి వండిపెట్టేవాడు. మొత్తం సినిమా అంతా సౌండ్‌వరం అనే వూళ్లో అవుట్ డోర్‌లో తీశారు. రాత్రిళ్లు సౌండ్‌వరం చుట్టుపక్కల వూళ్లలో, షూటింగు వారి సెనగపప్పు అండ్ పొటేటో ఎఫెక్టుకి, ఎవరికీ నిద్రపట్టేదికాదు. కొంతమంది దీపావళి తొందరగా వచ్చేసిందనుకున్నారు. యింకొంతమంది వియత్నాం వార్ కల్లో కల్లోలం చేస్తోందనుకున్నారు.

మర్నాడు నిర్మాత ఢమాల్‌రావు, కేటరింగ్ శబ్దతారకాన్ని పిలిచి - నువ్వు యివాళ్టినుంచి ఆ దిక్కుమాలిన సెనగపప్పు, పొటేటోలు వండడం మానకపోయావంటే పని మానేసి వెళ్లిపో. ఈ సౌండ్ ఎఫెక్ట్స్‌తో సినిమా యిండస్ట్రీ అంతా ప్రకంపిస్తోంది.. అని వార్నింగిచ్చాడు.

'అయ్యా! తమ పిక్చరుకి బిజిఎమ్ ఖర్చు తగ్గుతుంది కదండయ్యా!' అన్నాడు శబ్దతారకం.

'అదీ నిజమే. సరే అలాక్కానీ.' అని శాంతిస్తూ గో ఎ హెడ్ అని పృష్ఠవిన్యాసం చేశాడు సెనగపప్పు తిన్న ఢమాల్ రావు.

రీరికార్డింగ్ ముందే సినిమా రకరకాల బాజాభజంత్రీలతో తయారైంది.

ఇక చివరి సీను మిగిలింది. అది ప్రేమ సన్నివేశం. సెలయేరు, వొక కొలను, అపారమైన వృక్షసంపద, రకరకాల రంగురంగుల పూల మొక్కల్ని అమర్చారు.

హీరోగారు రోజూ వ్యాయామం చేస్తూ కండలు కండరాల వుండల్లా పెంచుకున్నారు. ఆయన ఏ సన్నివేశం చేసినా అతి సహజంగా చేస్తారు. గొప్పనటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆ బాలగోపాలం ఆ హీరోగారిని విశ్వవిఖ్యాత ఖండకండాల నట సమ్రాట్ అని శ్లాఘిస్తారు.

హీరోయిన్ అందంగా, పుష్టిగా వుంటుంది. అవుట్‌డోర్ షూటింగ్‌లో అనవరతం సెనగపప్పు తిని వొంట్లో బాగా గాస్ బిల్డప్పయి మరింత పుష్టిగా తయారైంది.

అవాళ మన హీరోగారు, హీరోయిన్ దగ్గరకొచ్చి గట్టిగా వాటేసుకుని - ఈరోజు మన మనసులేకాదు, మన శరీరాలు కూడా వొకటై పోవాలి - అనాలి.

హీరోగారు తన సహజరీతిలో హీరోయిన్‌ను సమీపించి - మన్నింకెవరూ వేరుచేయలేరు - అని చటుక్కున తన నటసింహబలంతో వాటేసుకున్నాడు.

వెంటనే ఒక ఆవు 'అంబా' అని ఆప్యాయంగా హై వాల్యూమ్‌తో అరిచిన శబ్దం వచ్చింది.

ఆ 'అంబా' అనే ఆవు ఆక్రోదన ఎక్కణ్ణించి వచ్చిందా అని ప్రొడక్షన్ క్రూ అంతా చుట్టుపక్కల చూస్తూ చెవులు రిక్కించారు. కానీ ఆ పరిసరాల్లో ఎక్కడా ఆవుగానీ, గేదెకానీ వారికి కనబడలేదు. వినబడలేదు. అంతకుముందు సీనులో మన సహజ కండల హీరోతో తన్నులు తిన్న విలన్‌గారు మాత్రం తన పక్కటెముకలు విరక్కొట్టుకుని మూలుగుతూ మూల వొదిగి మూర్ఛపోయేస్థితిలో వున్నాడు. అతడు 'అంబా' అని ఆవులా అరిచే ఆస్కారం అక్కడెవరికీ అనిపించలేదు.

హీరోగారు - 'ఏవిటీ విచిత్రం! ఏవిటీ అంబా?' అని అడిగారు.

- అదీ విక్రమార్కా! జరిగిన విషయం. ఇప్పుడు చెప్పు! ఆవులా 'అంబా' అని అరచిన శబ్దం యెక్కడ నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? అసలేం జరిగింది? ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల ఆవు తలలా మారిపోయి, నువ్వుకూడా 'అంబా, అంబా!' అంటూ ఆ సినిమాకి బిజిఎమ్ ఓవర్ చేస్తూ పొద్దస్తమానం ఎద్దుకోసం గాలిస్తూవుంటావ్!" - అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు, 'ఓ బేతాళా! ఆ ప్రేమ సన్నివేశంలో హీరో సహజనట కండల సామ్రాట్, సకల వేళలా సెనగపప్పు తింటూ పుష్టిగా వున్న హీరోయిన్ సంపుష్టిగా తయారై దగ్గరకు రాగానే, 'మనల్ని ఎవరూ ఎప్పుడూ వేరు చేయలేరు' అని కుస్తీ ప్రేమికుడిలా చటుక్కున వాటేసుకున్నాడు. వెంటనే హీరోయిన్ పొంగిన పూరీలా వున్నది, చపాతీలా అకస్మాత్తుగా పలుచనయిపోయింది. అప్పుడే అనూహ్యంగా ఆవు 'అంబా' అరచిన శబ్దం చెలరేగింది. వెంటనే హీరోగారు, 'ఏవిటీ 'అంబా?' అని హీరోయిన్‌ని అడిగారు.. హీరోయిన్, హీరోతో రహస్యంగా 'ఆ శబ్దం నాదే హీరోగారు. మీరు గట్టిగా ప్రేమతో వాటేసుకున్నప్పుడు నా వొంట్లోంచి గాస్‌లీక్ అయి 'అంబా' అని పృష్ఠరాగం పలికింది. దయచేసి ఈ విషయం ఎవరికీ చెప్పకండి. నా గ్లామర్ దెబ్బతింటుంది' అని ప్రాధేయపడింది. అందుకు రిప్లైగా హీరోగారు - చెప్పకపోతే ఎలా - జనం ఆ పృష్ఠరాగం మేం పాడావనుకుంటారు. మా గ్లామర్ దెబ్బతినదా?' అంచేత మీరు సవ్యవాచి అని చెప్పక తప్పదు. అయినా ప్రపంచ ప్రఖ్యాత నటి మెరిల్‌స్ట్రీప్‌గారే ఆస్కార్ ఫంక్షన్‌లో చెప్పినప్పుడు, ఆమె గ్లామర్ వీసం కూడా తగ్గలేదే సినీ కళాకారులకి నటన ముఖ్యం, సెనగపప్పుకాదు అని హీరోయిన్ హీరో కాళ్లు పట్టుకుని ప్రాధేయపడుతున్నా వినకుండా, తెగిపోయిన చెప్పుతొడుక్కుని కాలు ఈడ్చుకుంటూ నడుస్తున్నట్టు నడుస్తూ, - ఫిలిం క్రూ అందరితో - బ్రదర్స్! ఆ సౌండ్

మాదికాదు. హీరోయిన్‌గారే నోటితో చెప్పాల్సిన డైలాగ్, నోట్లో సెనగపప్పు అడ్డం వచ్చి, వాచిన తమ కింద పెదవులతో - ఆవులా 'అంబా!' అని చెప్పారు. సెనగపప్పుతో యుద్ధం చేయుట అసాధ్యం.

'యదృచ్ఛ యా చోపపన్నం
స్వర్గద్వారమపావృతమ్!
సుఖినః క్షత్రియాః పార్థ!
లభంతే యుద్ధ మీ దృశమ్!!

- ఈ యుద్ధము హీరోయిన్, కావాలని షాట్‌లో ఆశించలేదు. దానంతట అదియే త్రోసుకువచ్చినది. -

అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు -"

- అని విక్రమార్కుడు సమాధానం ముగించగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు, ఆవులా వినయంగా 'అంబా! అంబా!' అని ఆశ్చర్యంబోనిధిలో మునిగి, ఈతకొట్టుకుంటూ వెళ్లి మళ్లీ చెట్టెక్కేసాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments